క్లుప్తంగా

గృహ నిర్మాణాల పరిశీలన



వడలిలో గృహనిర్మాణాలకు జియో ట్యాగింగ్ చేస్తున్న అధికారులు

పెనుగొండ: 2014–19 కాలంలో గృహనిర్మాణాలను హౌసింగ్ యాప్‌లో పర్యవేక్షించారు. సోమవారం వడలిలో నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించి, బ్యాంక్ ఖాతాలను నమోదు చేశారు. సుమారు 118 గృహాలను పరిశీలించాల్సి ఉందని తెలిపారు. బాధితులు త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ పరిశీలనలో హౌసింగ్ ఏఈ బొక్కా లక్ష్మణరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కు ఘన నివాళి



పెనుగొండలో సీపీఎం నేత ఆర్ఎస్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: సీపీఎం జిల్లా నిర్మాత కామ్రేడ్ ఆర్.సత్యనారాయణరాజుకు మండల సీపీఎం పార్టీ ఘనంగా నివాళులర్పించింది. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఎస్ చివరి శ్వాస వరకూ పేదల పక్షాన నిలిచారన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ విప్లవ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన యావత్ జీవితాన్ని సీపీఎం పార్టీకి అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ పాదుషా, నీలాపు ఆదినారాయణ, శీలం ఏసులు పాల్గొన్నారు.

తగ్గిన వరద ప్రభావం



కనకాయలంక కాజ్‌వేపై తగ్గిన వరద ప్రవాహం

యలమంచిలి: గోదావరి శాంతించింది. వరద ప్రభావం పూర్తిగా తగ్గింది. నాలుగు రోజులుగా వరద ముంపులో ఉన్న కనకాయలంక కాజ్‌వే సోమవారం పూర్తిగా బయట పడింది. దీంతో కనకాయలంక ప్రజలు ఉపశమనం పొందారు. కాజ్ వే మీద రాకపోకలు ప్రారంభించారు. వరద తగ్గినా గ్రామంలో వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నారు. వరద వల్ల నీటి కాలుష్యం వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు కాచి, చల్లార్చి, వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని లంక గ్రామాల ప్రజలకు వైద్యులు సూచిస్తున్నారు.

రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడిగా జక్కంపూడి



జక్కంపూడి కుమార్

పాలకొల్లు సెంట్రల్: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజినల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా పాలకొల్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ రెండోసారి నియమితులయ్యారు. సోమవారం నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలు కల్పించే విధంగా మరింత కృషి చేస్తానని అన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన బీజేపీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు, నాయకులకు, జిల్లా, నియోజకవర్గ నాయకులకు, విజయవాడ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రిటైర్డు ప్రిన్సిపాల్ సీవీవీకి నటగాన ప్రవీణ బిరుదు ప్రదానం



రిటైర్డు ప్రిన్సిపాల్ సీవీవీ సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: సమాజ రుణం తీర్చుకునే రీతిలో వ్యవహరించే వారికి భగవదానుగ్రహం లభిస్తుందని రిటైర్డు ప్రిన్సిపాల్, సాహితీవేత్త సీవీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని యాళ్లవానిగరువు శ్రీలక్ష్మీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయన సోమవారం రాత్రి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కమిటీ సభ్యులు మూర్తిని శాలువాతో సత్కరించి నటగాన ప్రవీణ బిరుదును ప్రదానం చేశారు. కమిటీ సభ్యులు వడ్లమాని హరికృష్ణ, కె చంద్రరావు, ఎల్ సతీష్‌వర్మ, కమిటీ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, చందు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

వదలని ముసురు



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో ఇంజన్లు వేసి నీటిని బయటకు తోడుతున్న పంచాయతీ సిబ్బంది

భారీ వర్షాల హెచ్చరికలతో అన్నదాతల్లో ఆందోళన

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈనెల 31నుంచి ముసురు పట్టింది. దాదాపు అన్ని మండలాల్లో చినుకులు పడుతూనే ఉన్నాయి. వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 7, 8, 9వ తేదీల్లో భారీ వర్షం కురవడంతో చేలు ఏరులను తలపిస్తుండగా, పల్లపు ప్రాంతాలతో పాటు మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నీరు నలిచి పోవడంతో విద్యార్థులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం వేకువ జాము నుంచి వర్షం పడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కాళీపట్నం, కెపి పాలెంలో ప్రధాన రహదారులపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాళీపట్నం పడమర గ్రామంలో పలు చోట్ల ఇళ్లల్లోకి నీరు చేరే అవకాశం ఉండటంతో గ్రామ సర్పంచ్ కవురు సావిత్రి ఆదినారాయణ నిలిచి పోయిన నీటిని బయటకు తోడేందుకు కృషి చేస్తున్నారు. మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణ పూర్తిగా మునిగిపోవడంతో నాలుగు ప్రాంతాలలో ఇంజన్లు వేసి నీటిని బయటకు తోడేలా సర్పంచ్ పడవల మేరీ, ఉపసర్పంచ్ బోణం నర్సింహరావు, వార్డు సభ్యులు కృషి చేస్తున్నారు. మరోవైపు మునిగిన చేలును వ్యవసాయాధికారులు పరిశీలించి రైతులకు పలు సూచనలు అందజేస్తున్నారు. ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు నాట్లు మునిగిపోయాయి. దీంతో వ్యవసాయాధికారులు మునిగిన వర్షాలకు చేలను పరిశీలించి చేలల్లో నిలిచి పోయిన నీటిని బయటకు తోడి ఎకరాకు 20కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చల్లాలని రైతులకు సూచించారు. మరో రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురిస్తే చేలు మొత్తం మునిగిపోతాయని, ఇటీవలే వేసిన నారుమడులు కూడా పాడై పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



శేరేపాలెంలో చేలల్లో మునిగిన నీటిని బయటకు తోడుతున్న రైతులు



మొగల్తూరు గొల్లగూడెంలో మునిగిన వరి చేలు

జై జై గణేశా...జై కొడతా గణేశా...!

ఘనంగా వినాయక చవితి వేడుకలు

నరసాపురం: వినాయక చవితి ఉత్సవాలు పట్టణంలో పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీగా వినాయక మండపాలు ఏర్పాటు చేసి చవితి పూజలు చేస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభమై మూడవరోజుకు చేరడంతో సోమవారం అన్ని మండపాల వద్ద పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. పండ్ల మార్కెట్‌సెంటర్, పంజాసెంటర్, రాయిపేట మూడుబొమ్మల సెంటర్, చినమామిడిపల్లి, శనివారపుపేట, పీచుపాలెం, వనువులమ్మగుడి, పొన్నపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసి భారీ గణపతి విగ్రహాలను పెద్దసంఖ్యలో భక్తులు తిలకించి పూజలు చేశారు.

నరసాపురం రూరల్: గణేష్ నవరాత్రుల ఉత్సవాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. కొప్పర్రు గ్రామంలోని బాబావారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో పోలిశెట్టి గణేశ్వరరావు దంపతులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని చిట్టవరం, పసలదీవి, కె.బేతపూడి, వేములదీవి తదితర గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేసి భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవాలు పురస్కరించుకుని తీన్‌మార్, బుట్టబొమ్మలు, డప్పువాయిద్యాలతో శనివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లోని గణేష్ మండపాలలో ప్రతి రోజూ ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు అలరిస్తున్నాయి.



సిద్ధాంతంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా వినాయకుని ఊరేగింపులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వినాయకుని ఆలయాలతో పాటు ప్రధాన కూడళ్లలోనూ మండపాలు ఏర్పాటు చేసి వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వినాయక చవితి మూడో రోజు సోమవారం పలు గ్రామాలతో పాటు మొగల్తూరులోని పడమటిపాలెం, నెంబర్1 పాఠశాల ప్రాంతంలోని వినాయకున్ని ఘనంగా ఊరేగించారు. మేళతాళాలు, తీన్ మార్ డప్పులతో పాటు విచిత్ర వేషదారణలు, బాణ సంచా కాల్పులతో వినాయకుడ్ని ఊరేగించారు.

జోరుగా గణేష్ నిమజ్జనాలు

పెనుగొండ: వినాయక చవితి నిమజ్జనాలు జోరుగా సాగుతున్నాయి. మూడవ రోజు సోమవారం పెనుగొండ, ఆచంట మండలాల్లో నిమజ్జనాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సిద్ధాంతంలో అగ్నికుల క్షత్రియ సంఘం, ఆచంట వారి వీధి, శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం, రావి చెట్టు సెంటర్ జై భజరంగదళ్ యూత్, ఘటాల దిబ్బ శెట్టి బలిజ సంఘం, వడలిల నుంచి పలు సంఘాలు ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు అనంతరం గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, తీన్‌మార్ జోరు, శక్తి వేషాలు, విచిత్ర వేషాలతో బాణా సంచా కాల్పులుతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సిద్ధాంతం కేధారీ ఘాట్‌లో వశిష్టా గోదావరిలో వినాయక ప్రతిమలకు నిమజ్జనం నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పెనుగొండ ఎస్ఐ గంగాధర్ పర్యవేక్షణ చేశారు.

పెనుగొండలో

పెనుగొండలో గణపతి నిమ్మనోత్సవాలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వెలమపేట, చెరుకువాడల్లో బాల గణపతిలుకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నర్సాపురం కాలువలో నిమజ్జనం నిర్వహించారు.



నరసాపురం రూరల్: కొప్పర్రులో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మొగల్తూరు: వినాయకుని ఊరేగింపులో పాల్గొన్న యువకులు



నరసాపురం: పట్టణంలో ఏర్పాటు చేసిన గణనాథుడు

ఏఐ రాకతో ఉపాధి కల్పనకు మరిన్ని అవకాశాలు



ఇంటెలిజెన్స్ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్వర్ణాంధ్ర చైర్మన్ సత్యనారాయణ తదితరులు.

నరసాపురం రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యొక్క ఆగమనం ఉపాధి కల్పనకు అపారమైన అవకాశాలు, ముఖ్యమైన సవాళ్లను రెండింటినీ అందజేస్తుందని, ఇవి పనులను తెలివిగా నిర్వహించడానికి ఎంతగానో దోహదపడుతుందని స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కెవి సత్యనారాయణ అన్నారు. సోమవారం నరసాపురం మండలం సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ ఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో ఐబీఎం కంపెనీ, వన్ మిలియన్ టూ వన్ బిలియన్ కంపెనీ సంయుక్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగ స్థిరత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్లు అడ్డాల శ్రీహరి, పి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ గోపీచంద్, వన్ మిలియన్ టు వన్ బిలియన్ సంస్థ డైరెక్టర్ రాహుల్ మూర్తని, ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి బొమ్మ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసీ ముగింపు వారోత్సవాలు



ప్రతిభ కనబర్చిన ఏజెంట్లను సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: దేశీయ బీమా రంగంలో ఎన్ని కంపెనీలు ఉన్న ప్రభుత్వ ఆధీనంలోని జీవిత భీమా సంస్థ (ఎల్ఐసీ)ది ప్రత్యేక స్థానం అని సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ తోట శ్రీనివాసబాబు అన్నారు. సోమవారం నరసాపురం స్టీమర్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయంలో జరిగిన ఎల్ఐసీ వారోత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ జి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల నమ్మకం, ఆదరణతోనే జీవిత బీమా సంస్థ 68 ఏళ్లుగా విశేష సేవలందిస్తుందన్నారు.

ఆక్వా వ్యాన్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పాలకొల్లు సెంట్రల్: ద్విచక్ర వాహనంపై వెళుతున్న చెల్లిబోయిన సింహాచలం అనే వ్యక్తిని ఎదురుగా వస్తున్న ఆక్వా వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి పాలకొల్లు మండలం భగ్గేశ్వరానికి చెందిన సింహాచలం పట్టణంలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో ఉద్యోగం ముగించుకుని ఇంటికి వెళుతుండగా పూలపల్లి బైపాస్ రోడ్డు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) వద్ద ఆకివీడు నుంచి పాలకొల్లు వైపు ఎదురుగా వస్తున్న ఆక్వా వ్యాన్ సింహాచలం వాహనాన్ని ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం సింహాచలాన్ని రాజమండ్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పంట నష్టం అంచనాలను సిద్ధం చేయాలి



పాలకొల్లు :మునిగిన వరినాట్లు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు



పెనుగొండ: వేమవరంలో రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

పాలకొల్లు అర్బన్: అధిక వర్షాల కారణంగా నీట మునిగి నష్టపోయిన రైతుల పంట పొలాల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని లంకలకోడేరు, వెలివెల, శివదేవునిచిక్కాల తదితర గ్రామాల్లో నీటమునిగిన వరిచేలను సోమవారం ఆయన పరిశీలించారు. పాలకొల్లు మండలంలోని 14 గ్రామాల్లో 490 ఎకరాల్లో వరిపైరు నీట మునిగినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. శివదేవునిచిక్కాల, ఆగర్రు, గోరింటాడ, ఉల్లంపర్రు, దిగమర్రు, లంకలకోడేరు, వరిధనం, తిల్లపూడి, వెలివెల, పెదమామిడిపల్లి, చందపర్రు, చింతపర్రు గ్రామాల్లో అధిక వర్షాల కారణంగా వరిపైరు నీట మునిగినట్లు గుర్తించామన్నారు. ఈ నెల 15వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏడీఏ అడ్డాల పార్వతి, వ్యవసాయాధికారి కె రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ముంపు చేలుపరిశీలన

పెనుగొండ: ఆచంట మండలం వేమవరంలో ముంపుకు గురైన వరిచేలను జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. సోమవారం ముంపుచేలను పరిశీలించి, రైతులతో మాట్లాడుతూ అధికార వర్షాలు, నక్కల డ్రెయిన్ వలన దెబ్బతిన్న వరి చేలను గుర్తించి పంట నష్టం జాబితా తయారు చేయాలని రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలకు ఆదేశించారు. నష్టపోయిన రైతులు త్వరతిగతిన పాస్‌బుక్, కౌలు రైతు కార్డు, జిరాక్స్, ఆధార్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయాధికారి అడ్డాల పార్వతి, ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి బి నాగరాజు, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల పంపిణీ



యలమంచిలిలో సర్పంచ్‌లకు రూ.లక్ష చెక్కులు పంపిణీ చేస్తున్న నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

యలమంచిలి: వరద ప్రభావిత పంచాయతీలకు డిప్యూటీ సీఎం అందించిన సహాయాన్ని సోమవారం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఉమా నరసింహస్వామి కల్యాణ మండపంలో నిర్వహించారు. పాలకొల్లు, నరసాపురం నియోజవర్గంలోని 11గ్రామాలకు రూ.లక్ష చొప్పున చెక్కులను కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో వరద ప్రభావానికి గురైన 400 పంచాయతీలకు రూ.1 లక్ష చొప్పున రూ.4 కోట్లు ప్రకటించారన్నారు. ఈ డబ్బును గ్రామాభివృద్ధికి సక్రమంగా వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, రాష్ట్ర కమిటి సభ్యుడు కనకరాజు సూరి, రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ బన్నీ వాసు, స్థానిక నాయకులు కొడవటి వరబాబు, ఉన్నమట్ల ప్రేమ్‌చంద్, బొప్పన చిన్న తదితరులు పాల్గొన్నారు.


నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

నరసాపురం రూరల్: ఇటీవల కురిసిన అధిక వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం ఆయన నరసాపురం మండలంలోని అధిక వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న సార్వా చేలను వ్యవసాయశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్ కుమారి, ఏవోలు జాన్సన్, రహీమ్, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

భీమవరం: భీమవరం మెంటవారితోటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాలకొల్లు లయన్స్ ఆసుపత్రి సహకారంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యుడు కోయ కిషోర్ ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 342 మంది రోగులను పరీక్షించగా 75 మందికి కళ్లజోళ్లు, 80 మందికి ఆపరేషన్ అవసరమవుతాయని గుర్తించా0రు. 10 రోజుల్లో కంటి శస్త్ర చికిత్సలు చేస్తామని మేనేజర్ లక్ష్మీపతిరాజు చెప్పారు.

మొగల్తూరు సొసైటీలో విచారణ



మొగల్తూరు సహకార సంఘంలో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

మొగల్తూరు: మొగల్తూరు సొసైటీలో విచారణకు అధికారులు సోమవారం మళ్లీ ప్రారంభించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో సోమవారం భీమవరంకు చెందిన అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ జే వెంకటేశ్వరరావు సోమవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొసైటీలో జరిగిన అవినీతిపై 51ఏ విచారణ కోరుతూ కొంత మంది వ్యక్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. అయితే అప్పటి ఎమ్మెల్యే సిఫార్సు మేరకు అప్పటి మంత్రి స్టే ఇచ్చారన్నారు. ప్రభుత్వం మారడంతో గతంలో ఇచ్చిన స్టేను తొలగించడంతో పాటు తనను విచారణాధికారిగా నియమించారన్నారు. దీంతో తాను గతంలో జరిగిన లావాదేవీలను తనిఖీ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులకు నోటీసులివ్వడం జరిగిందన్నారు.

దగ్గులూరులో కోడి పందేలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో సోమవారం కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు స్టేషన్ రైటర్ సీహెచ్ మూర్తి తెలిపారు. వీరి నుంచి ఒక కోడి పుంజు, కత్తి, రూ.2వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయిలో చిన్నారుల ప్రతిభ



కాశీలో సర్టిఫికెట్లు అందుకుంటున్న చిన్నారులు

నరసాపురం: మండలంలోని శ్రీ ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో కూచిపూడి నృత్యాల్లో అలరించారు. అమెరికన్, ఏషియన్ రికార్డులు సాధించి ప్రశంశలు అందుకున్నారు. అంతర్జాతీయ సంగీత, నృత్య చెన్నై అనే ఐసీఎండీఏ సంస్థ 9,445 మంది కూచిపూడి కళాకారులతో కాశీలోను, అయోధ్య బాలరామ మందిరంలోను అమెరికన్, ఏషియన్ ప్రపంచ రికార్డుల నిమిత్తం ఈనెల 5వతేదీన నృత్య నిరాజనం నిర్వహించారు. ఈ 9,445 మందిలో నరసాపురం ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు 50 మంది పాల్గొని రికార్డులు సాధించారు. ముఖ్యంగా కాశీలో వి.అనంతలక్ష్మీదేవి శిష్యులు 50 మంది చేసిన నృత్యాలు ప్రశంసలు అందుకున్నాయి. సోమవారం పట్టణానికి చేరుకున్న అనంతలక్ష్మీదేవి ఆమె శిష్యులను పట్టణానికి చెందిన రాజకీయ, వ్యాపార, విద్యాసంస్థలు అభినందించాయి.